# ప్రశ్న

"ఏయ్!"

"ఏయ్! సావిత్రీ! లే!"

బద్ధకంగా ఒత్తిగిల్లింది సావిత్రి.

"ఏయ్! నీకింకా నిద్ర వదల్లేదా? లే!"

వీపుమీద చరిచిన చరుపుకి ఉలిక్కిపడి లేచింది. సావిత్రి.

"నీ నిద్రే కాని, బాబుని టాయిలెట్ చేసి స్కూలుకి ఎప్పుడు పంపిస్తావ్! తిండం.... పడు కోవడమే కాని ఇంకేం పని లేదా?" కసురు కున్నాడు భర్త.

సావిత్రి మౌనంగా లేచి కాలకృత్యాలు తీర్చు కుంది.

తొమ్మిది అయ్యేసరికి భర్త ఆఫీసుకు వరుగందుకున్నాడు.

ఆఫీసుకు వెళ్లే లోపల స్నానానికి...కారేజికి... టిఫెన్‌కి..... వంతులవారీ భర్తతో చివాట్లు తింది సావిత్రి. అతను ఎన్ని అన్నా నోరు మెదపలేదు. మెదపదు కూడా. సావిత్రి పతివ్రత!

బాబుకు స్నానం చేయించింది.

"అమ్మా! ఇవేళ మా స్కూల్లో ఆటలు ఆడి స్తారు"

"నువ్వు బాగా ఆడాలి బాబూ!"

"నేను ఆడతా కాని, ఆ రాజేష్ లేడూ! రౌడీ వెధవ! నన్ను ప్రక్కకు నెట్టేసి గెలిచేస్తాడు."

"నువ్వూ నెట్టేసి గెలవాలి కదా!"

"అమ్మో, తప్పు కదా!"

"తప్పని ఎవరన్నారు?"

"మా టీచర్ అన్నారు. గాంధీ తాతని ఎవరో ఒక చెంప మీద కొడితే రెండో చెంప చూపించా రట కదా! అలా శాంతంగా వుంటే మనకే అంత పేరొస్తుంది కదా!"

"రాదు బాబు! కలబడ్డ వాడి మీద మనం తిరగబడకపోతే పిరికి వెధవ... చేతకాని చవట అంటారు. ఈ రోజులలో తిరగబడితేనే తిండి దొరుకుతుంది బాబూ!"

"ఆ! మరి నువ్వు తిరగబడవేం?"

"నేనా" ఆశ్చర్యపోయింది సావిత్రి.

"మరి నాన్న నిన్ను రోజూ కొడతారుగా! మరి నువ్వు కూడా నాన్నని కొట్టవేం?"

బాబు అమాయకపు ప్రశ్నకు సమాధానం దొరక్క అవాక్కయింది సావిత్రి.

తిరగబడితే కాని బ్రతుకలేని ఈ లోకంలో భర్తంటే బాధించేవాడని, భార్య బాధితురాలని ఎలా... ఎలా సమాధానం చెప్పగలుగుతుంది?

—ఇందూ రమణ

# నెత్తుటి శాపం

"డాక్టరాంటీ..." ఆప్యాయంగా పిలిచాడు పుట్టుకతోనే అవిటివాడైన ఏడేళ్ల శ్రీను తన తల్లికోసం వచ్చిన ఆమె ఫ్రెండ్ భారతిని.

"ఏంటి బాబు?"

"నా కాలు ఎప్పటికీ సరి కాదా ఆంటీ?"

"......." మాట్లాడలేదు భారతి.

"టి.వి.లో గేమ్స్ చూస్తున్నప్పుడు నాకు కూడా కపిల్‌దేవ్ అంతటి బౌలర్‌ని కావాలని, లెండిల్ అంతటి టెన్నిస్ ఆటగాడ్ని కావాలని అనిపిస్తుంది. పైగా సినిమాలు చూస్తున్నప్పుడు పెద్దయ్యాక ఇన్‌స్పెక్టర్‌ని కావాలని అనిపిస్తుంది."

దీనంగా చెప్పాడు శ్రీను.

"......"

"నా కాలు పుట్టుకతోనే ఇలా ఎందు కయ్యింది ఆంటీ?"

జాలిగా అడిగాడు భారతి జవాబివ్వక పోయేసరికి.

"అందుకు కారణం......." కోపంతో నాలుక చివరికి వచ్చిన మాటలని మింగేసి లోపల అనుకుంది. "దగ్గరి సంబంధం చేసుకుంటే పిల్లలికి అంగ వైకల్యంవచ్చే అవకాశం వుందని నేను చెప్పినా, పెద్దవాళ్లకి ఎదురు చెప్పలేక పోయిన మీ అమ్మ, మెట్రిక్ మూడుసార్లు తప్పిన మీ నాన్న. తన మరదలి కంటే అందగత్తె లెవ్వరూ తనని పెళ్లి చేసుకోరని నొప్పుకున్నారు. దగ్గరి సంబంధమని మీ అమ్మమ్మ యిష్టపడితే, కట్నం మివ్వక్కర్లేదని మీ తాత చంకలు గుద్దుకున్నాడు. వాళ్లందరూ కలిసి నువ్వు పుట్టక ముందే నీ ఆశలని చంపేశారు బాబూ!"

"ఏమిటాంటీ?" అడిగాడు శ్రీను భారతి తన మాటలని మధ్యలోనే ఆపేసినందుకు.

"ఏమి లేదు బాబు!" అని శ్రీను తల నిమిరి, వెళ్లిపోయింది డాక్టర్ భారతి తన స్నేహితురాలిని కలవకుండానే.

— ఎం. నాని




'ట్రింగ్ ... ట్రింగ్ ... ట్రింగ్ ... ట్రింగ్' ఫోను అగ్నిమాపక యంత్రమువలె ఆగక మ్రోగెను.

'హలో'

'రాజీయేనా?'

'ఓహో! తమరా? ఉపశ్రీగారి ఉపన్యాసమునకని చెప్పి ఉమర్ షరీఫ్ చిత్రరాజమునకు ఉడాయించెదు శ్రీవారితో రాజీకి ఏ భార్య ఒప్పుకొనును?'

'శబ్ద చమత్కారములకిది సమయము కాదు. 'చెవిలో పువ్వు' వ్రాతబల్లపై ఉన్నదేమో త్వరగా చూడుము.'

'ఉదయమెప్పుడో దేవతార్చన వేళ పెట్టుకొనిన వాడిపోయిన పువ్వును గురించి ఏమంత ఆందోళన?'

'చేతులెత్తితిని. సూటిగా మాటాడుము.'

'కాళులొత్తుట ద్వాపర మర్యాద. చేతులెత్తుట కలియుగ పద్ధతియా?'

'అహో! విసిగింపకుము. సమయమునకు రచన నందీయలేదని ఇక్కడ నన్ను శర్మగారు ముక్క చీవాట్లు పెట్టుచున్నారు.'

'ఏమని?'

'ఏమండీ పావనిశాస్త్రిగారూ! మీరు రచనలు చేసి పాఠకులకును, చేయకయే చేసి తెచ్చితినని మాకును పూవులు పంచుచుంటిరే' అని చమత్కరించు చున్నారు.

'బాబాయిగారికి నేను 'సిఫారసు' చేయుదునా?'

'సరిసరి చాలుగాని ఇంటిలో ఎక్కడైనను పడిన దేమో వెదకి చెప్పుము. నిన్న సాయంతనమున సాపు వ్రాసి నా 'చేతి పెట్టె'లో పెట్టినట్లు బాగుగా గురుతు. ఇపుడు కనిపించుటలేదు.'

'ఇల్లంతయు వెదకితిని. కనబడలేదు. పాముల బుట్ట వంటి మీచేతి పెట్టెనే మరొకసారి తిరుగ ద్రోడుదు.'

'చూచితిని. లేదు. ఇప్పుడేమి చేయవలెను?'

'ఇల్లు కదలని ఆడుదానను. నేనేమి చేయుగలను? మీరే ఏదో ఉపాయమును ఆలోచించుకొనుడు.'